


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 02-05-2025 | సంపుటి - 23 సంచిక - 02 రూ : 4 | పేజీలు: 8


## సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం..

- శ్రీనగర్‌లో పోలీసు సోదాలు

**మే 1, ఢిల్లీ:** అమృత్‌సర్ సమీపంలోని పాక్ సరిహద్దులో ఉగ్ర కుట్రను మన బలగాలు భగ్నం చేశాయి. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. బీఎస్ఎఫ్ నిఘా విభాగ సమాచారం మేరకు బుధవారం రాత్రి ఈ ఆపరేషన్ నిర్వహించారు. శ్రీనగర్‌లో 21 ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. అల్ ఉమర్ ఉగ్రవాద సంస్థ

తరువాయి 2లో






## బడ్జెట్ పద్మనాభంలా లెక్కలేసుకుంటున్నా

- గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులు రూ.8.29 లక్షల కోట్లు
- రాష్ట్ర రాబడిలో నెలకు రూ.6,500 కోట్లు అప్పులకే పోతోంది
- ఆర్టీసీ కార్మికులారా... సమ్మె ఆలోచన వద్దు
- కార్మిక దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**మే 1, హైదరాబాద్:** నెల జీతంలో నిత్యావసరాలు, ఇతర ఖర్చులకు బడ్జెట్ పద్మనాభం వేసుకునే లెక్కల మాదిరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానూ లెక్కలు వేసుకుంటున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం రూ.18,500 కోట్లు కాగా

తరువాయి 2లో

## కులగణనలో తెలంగాణది రాంగ్ మోడల్

- రేవంత్ సర్కారు చేసింది బీసీ వ్యతిరేక సర్వే
- కేంద్ర నిర్ణయాన్ని తమ ఘనతగా రాహుల్ చెప్పుకోవడం సిగ్గుచేటు
- 2010లోనే భాజపా కులగణనకు అనుకూలంగా కేంద్రానికి లేఖ రాసింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

2లో





## మరో 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్'

- ఈ నెల 12 నుంచి అమలులోకి..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మే 1,** హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రవేశపెట్టిన స్లాట్ విధానాన్ని ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 కార్యాలయాల్లో అమలులోకి తేనున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. గత నెల 10వ తేదీ నుంచి 22 కార్యాలయాల్లో అమలు చేస్తున్న స్లాట్ విధానానికి మంచి స్పందన లభించిందని తెలిపారు. గత నెలాఖరుకు రోజుకు సగటున 866 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. రెండో దశలో ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజిగిరి, జనగామ, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, గజ్వేల్, సిద్దిపేట అర్బన్, రూరల్, రంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ దక్షిణ

తరువాయి 2లో

## పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తాం

: మంత్రి ఉత్తమ్

2లో





## ఇంటిని... నిర్మించి ఇస్తాం

- నలుగురు పిల్లలను చదివించే బాధ్యత సాహో ఫౌండేషన్‌ది
- బంగారు కుటుంబానికి సీఎం చంద్రబాబు హామీ

2లో

## 'ఉపాధి' శ్రామికులకు ప్రమాద పరిహారం పెంపు

- మృతి చెందినా, తీవ్ర అంగవైకల్యానికి గురైనా రూ.2 లక్షల సాయం
- మృతుల కుటుంబాలకు కేంద్ర బీమా పథకాల కింద మరో రూ.2 లక్షలు
- 'ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక' సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన




## భారత్‌లో సృష్టిద్దాం.. జగతికి అందిద్దాం

- ప్రపంచ వినోద కేంద్రంగా దేశం
- 'వేవ్స్' సదస్సులో ప్రధాని మోదీ
- హాజరైన సినీ, వాణిజ్యరంగ ప్రముఖులు

**మే 1, ముంబయి:** సంగీతం, సినిమా, గేమింగ్ రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఉదయిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌లో 'ఆరెంజ్ ఎకానమీ' (సృజనాత్మక ఆర్థికవ్యవస్థ) పరిఢవిల్లుతోందని తెలిపారు. ప్రపంచం కొత్తదనం కోరుకొంటున్న ఈ తరుణంలో ''భారత్‌లో సృష్టిద్దాం, జగతికి అందిద్దాం'' నినాదంతో మనం ముందడుగు వేయడానికి ఇదే సరైన తరుణమని చెప్పారు. దేశంలో తొలిసారిగా ముంబయిలో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్ 2025)ను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. నగర శివారులోని బాంద్రా కుర్లా కాంప్లెక్సులో గల జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో ప్రధాని ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సృజనశీలురు,

తరువాయి 2లో



# బడ్జెట్ పద్మనాభంలా లెక్కలేసుకుంటున్నా

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.30 వేల కోట్లు అవసరమని, దాదాపు రూ.12 వేల కోట్ల ఆదాయం తక్కువగా ఉందని వివరించారు. అయినా ఏ సంక్షేమ పథకాన్ని ఆపలేదని అన్నారు. నెలవారీ వచ్చే ఆదాయంలో రూ.6,500 కోట్లు అప్పులకు, రూ.6 వేల కోట్లు జీతభత్యాలు, పింఛన్లకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రవీంద్రభారతిలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతున్నాం. రాష్ట్రాన్ని గాడిన పెట్టే క్రమంలో నాతోపాటు మంత్రివర్గ సహచరులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. పది సంవత్సరాలు పాలించిన కేసీఆర్ ప్రభుత్వం రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేసింది. అయినా పేదలు మరింత నిరుపేదలుగా మారారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రం టీవీలు, దినపత్రికలు, ఫాంహౌస్‌లు, వ్యాపారాలు.. ఇలా వివిధ రూపాల్లో రూ.వేల కోట్ల ఆదాయం వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేస్తే.. అందులో రూ.1.52 లక్షల కోట్లు ఆయన (కేసీఆర్) చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే పోయింది. కార్మిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నాం. దేశానికే రోల్ మోడల్‌గా నిలవనుంది.

**కేసీఆర్ మాటలకు మోసపోవద్దు**

కేసీఆర్ హయాంలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి కుప్పలుగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మాకు అప్పగించారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే మూడేళ్లకే కూలిపోయింది. మనం ఇల్లు కట్టుకున్నా సుమారు 50 ఏళ్ల వరకు ఉంటుంది. చిన్న గుడిసె వేసుకున్నా పదేళ్లు ఉంటుంది. మళ్లీ ఇప్పుడు కపట నాటక సూత్రధారి మాదిరిగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులతో కూడా ఫోన్‌లో మాట్లాడుకోలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు మేం స్వేచ్ఛ, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

**ఆర్టీసీ కార్మికులూ.. పంతాలు వద్దు**

మేం అధికారంలోకి వచ్చాక అప్పుల్లో ఉన్న ఆర్టీసీని లాభాల వైపు నడిపిస్తున్నాం. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. మీకు (కార్మికులకు) నేను విజ్ఞప్తి చేస్తున్నా.. సమ్మె ఆలోచన వద్దు. ఈ సంస్థ మీది. రాజకీయ ప్రోత్సాహంతో సమ్మెకు వెళ్తే సంస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. పంతాలు, పట్టింపులకు పోవద్దు. ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాం. మరో ఏడాది అయితే కుదురుకుంటాం. ఏవైనా డిమాండ్లు ఉంటే మంత్రితో మాట్లాడండి. చేయగలిగేది ఏదైనా ఉంటే తప్పకుండా చేస్తాం. వచ్చే ఆదాయాన్ని ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచించండి. పైసా కూడా నేను ఇంటికి తీసుకువెళ్లను. అవినీతికి పాల్పడను. మీ కోసమే ఖర్చు చేస్తా. ప్రభుత్వాన్ని సమ్మెలు, ఇతర కారణాలతో నష్టపరచవద్దు. గ్రామాల్లో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేనప్పుడు పత్యం చేయాలని చెబుతుంటారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం కూడా బాగాలేదు. మీరు మద్దతిస్తేనే ఈ ప్రభుత్వం ఏర్పడింది. మీలో ఒక కుటుంబ సభ్యుడిగా చెబుతున్నా. కార్మికుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం. కష్టమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది" అని సీఎం అన్నారు. అనంతరం పలు యాజమాన్యాలకు, కార్మికులకు శ్రమశక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, కాలె యాదయ్య, శంకర్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' శ్రామికులకు ప్రమాద పరిహారం పెంపు

అమరావతి: పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, తీవ్ర అంగవైకల్యానికి గురైన ఉపాధి శ్రామికులకు ఇస్తున్న రూ.50 వేల పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2006 తర్వాత ఇప్పటి వరకు పరిహారం పెంచలేదని ఆయన అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మరో రూ.2 లక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందుకోసం ఒకే రోజు కోటి మంది శ్రామికుల పేర్లు బీమా పథకాల్లో నమోదు చేయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక' సభలో ఆయన ప్రసంగించారు. 'వైకాపా ప్రభుత్వం అప్పులపాలు జేసిన రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం వెన్నెముకగా నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (202425)లో రూ.10,660 కోట్లు



ఖర్చు చేశాం. ఇందులో రూ.6,194 కోట్లు వేతనాలకు, మరో రూ.4,023 కోట్లు మెటీరియల్ కింద వెచ్చించాం. వీటితో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గోకులాలు, పశువులకు నీటితొట్టెలు, నీటి కుంటలు నిర్మించాం. పెద్ద ఎత్తున పండ్ల తోటలు పెంచాం. ఈ ఏడాది కూడా 4 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 500 కి.మీ. పొడవున సిమెంట్ కాలువలు నిర్మించబోతున్నాం. శ్రామికులంటే నాకు అత్యంత గౌరవం. నా దృష్టిలో వారు కూడా శాస్త్రవేత్తలే. అందుకే ఉపాధి పథకంలో కూలీలు అనే పదాన్ని తొలగించి, శ్రామికులు అని చేర్చాం. కేంద్రం ప్రకటించిన కనీస వేతనం రూ.307 వచ్చేలా తగు చర్యలు తీసుకుంటున్నాం.

*** వ్యవసాయాన్ని అనుసంధానించేలా కృషి**

వ్యవసాయ రంగాన్ని ఉపాధి పథకానికి అనుసంధానించే విషయమై కేంద్ర ప్రణాళిక సంఘం, 16వ ఆర్థిక సంఘం కేంద్రానికి సిఫార్సు చేయాలి. జల్‌జీవన్ మిషన్‌లో రూ.87 వేల కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. ఇందులో రూ.29 వేల కోట్లతో పనులు చేయిస్తున్నాం. మిగతా నిధులు కూడా కేంద్రం ఇస్తుందని ఆశిస్తున్నా' అని పవన్ అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి డైరెక్టర్ షణ్ముఖరావు తదితరులు మాట్లాడారు. జిల్లాకు 10 మంది చొప్పున ఉపాధి శ్రామికులు కార్యక్రమానికి హాజరయ్యారు. పవన్‌తో మాట్లాడించి, జిల్లాల వారీగా గ్రూప్ ఫొటో దిగారు.

ఉపాధిలో యువతకు 'ఇంటర్న్‌షిప్'

నేటి యువతకు శ్రామికుల కష్టం తెలియాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకంలో వారికి ఇంటర్న్‌షిప్ కోసం ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీనివల్ల యువతకు కొంత ఆదాయంతోపాటు శారీరక శ్రమ తెలుస్తుంది. చాలామంది మొబైల్, టీవీకి అతుక్కుపోయి విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. శారీరక శ్రమ ఉంటే మానసిక సమస్యలు ఎందుకొస్తాయి? మా పిల్లలు ఎప్పుడైనా డిప్రెషన్ అంటే భోజనం చేయొద్దని, శ్రమ పడాలని చెబుతా. ఉపాధిలో నీటి సంరక్షణ వంటి కీలక బాధ్యతలు యువతకు అప్పగిస్తే ఎలా ఉంటుందో పరిశీలించాలని అధికారులను ఆదేశించా. తాగునీటి విలువ, వర్షపు నీటి సంరక్షణతో లాభాలను యువత తెలుసుకోవాలి. నేను స్వయంగా దుక్కి దున్నాను. తోటలో గుంతలు తీశా.

# పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తాం

మహబూబ్‌నగర్‌నాగర్‌కర్నూల్ : రానున్న రెండేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును, వచ్చే మార్చి 31 నాటికి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జలాశయాలు, పంప్‌హౌస్‌లు, కాలువలు, టన్నెళ్లను పరిశీలించారు. తొలుత నార్లాపూర్ పంప్‌హౌస్‌ను సందర్శించగా ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సలహాదారు పెంటారెడ్డి, సీఈ విజయభాస్కర్ అక్కడి పరిస్థితులను వివరించారు. విద్యుత్తు ఉపకేంద్రాలకు రూ.262 కోట్లు కేటాయించామని, ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించగా.. ఈ నెలాఖరుకల్లా పూర్తి చేస్తామని వారుచెప్పారు. తర్వాత నార్లాపూర్ ఇన్‌టేక్‌వెల్, కేఎల్ఐ పంప్‌హౌస్, నార్లాపూర్ రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, డెలివరీ సిస్టర్న్‌లను.., 6వ కిలోమీటరు వద్ద నార్లాపూర్ ఏదుల జలాశయాల మధ్య గ్రావిటీ కాలువ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి ఏదుల జలాశయం, పంప్‌హౌస్‌లను, ఉయ్యాలవాడలో నిర్మిస్తున్న నీటిపారుదలశాఖ భవన సముదాయాలను సందర్శించారు. అనంతరం వట్టెం పంప్‌హౌస్ వద్ద పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

**భారాస హయాంలో అన్యాయం**

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. భారాస హయాంలో పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఏపీ కృష్ణా జలాలను 6070 శాతం అధికంగా వినియోగించుకుంటోందన్నారు. రూ.20 30 కోట్లు ఖర్చు పెడితే టెలీమెట్రీలు పెట్టే అవకాశమున్నా అప్పట్లో ప్రభుత్వం పెట్టలేదని విమర్శించారు. రూ.38 వేల కోట్లతో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద నిర్మిస్తే 1.60 లక్షల ఎకరాలకు సాగునీరందేదని మంత్రి అన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. టన్నెల్‌లో ఆచూకీ లభించని మిగిలిన ఆరుగురి కుటుంబాలకు కూడా రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించామన్నారు. పర్యటనలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోశ్ పాల్గొన్నారు.

# భారత్‌లో సృష్టిద్దాం.. జగతికి అందిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

స్టార్టప్స్ పరిశ్రమల అధినేతలు, విధాన రూపకర్తలను వేవ్స్ ఒక వేదిక మీదకు తెచ్చిందన్నారు. ఈ వేదిక భారత్‌ను మీడియా, వినోదం, డిజిటల్ ఆవిష్కరణల్లో ప్రపంచ కేంద్రంగా నిలబెడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశం అంతర్జాతీయ చలనచిత్ర నిర్మాణకేంద్రంగా అవతరిస్తున్న నేపథ్యంలో ప్రపంచ ప్రతిభకు వేదికగా మారే సామర్థ్యం వేవ్స్ సంతరించుకొంటుందన్నారు. ఇండియన్ 'ఖానా' మాదిరిగానే 'గానా' కూడా ప్రపంచ ప్రసిద్ధం అవుతుందన్నారు. తెర పరిమాణం చిన్నదిగా మారుతున్నప్పటికీ, పరిధి అనంతమని వ్యాఖ్యానించారు. విభజనవాదం, హానికారకమైన భావజాలాల నుంచి యువతను రక్షించాల్సిన అవసరం ఉందని.. మన సాంస్కృతిక సమగ్రతను నిలబెడుతూ సానుకూల విలువలను పెంపొందించడానికి 'వేవ్స్' ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. సదస్సులో భారత్ పెవిలియన్‌ను ప్రధాని ప్రారంభించారు. దేశం సాధించిన ముఖ్యమైన ఆవిష్కరణలకు ఇది ప్రతిబింబమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మహారాష్ట్ర పెవిలియన్‌ను సైతం ప్రధాని సందర్శించారు.

**కీరవాణి స్వరాలతో ప్రారంభం**

సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి స్వరపరచిన రుగ్వేదంలోని ఉత్తేజపరిచే శ్లోకం ప్రార్థనగీతంగా వేవ్స్ సదస్సు ప్రారంభమైంది. ప్రముఖ గాయని శ్రేయాఘోషల్ బృందం దీనిని ఆలపించింది. బాలీవుడ్ నటుడు షారుక్‌ఖాన్ అతిథులకు స్వాగతం పలికారు. చిరంజీవి, ఎస్.ఎస్. రాజమౌళి, రజనీకాంత్, మోహన్‌లాల్, హేమామాలిని, అనుపమ్‌ఖేర్ తదితర సినీరంగ ప్రముఖులు భారతీయ ప్రతిభకు ఒక వేదిక కల్పించిన ప్రధాని దార్శనికతను అభినందిస్తూ ప్రసంగించారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సహా పలువురు వాణిజ్యరంగ ప్రముఖులూ సదస్సుకు హాజరై ప్రసంగించారు.

*** పహల్గాం దాడి అతి క్రూరం: రజనీకాంత్**

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తన ప్రసంగంలో పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావించారు. ఆ దాడి అతి క్రూరమైనదని, యోధుడైన ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది ప్రముఖులతో ఏర్పాటు చేయదలచిన ప్రధాని విందు కార్యక్రమం పహల్గాం విషాదం కారణంగా రద్దయింది. సంగీత కళాకారులతో సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి సైతం మోదీ హాజరు కాలేదు.

## సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం..

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థాపకుడు ముస్తాక్ అహ్మద్ జర్గార్ అలియాస్ లాట్రమ్ (ఐసీ814 విమాన హైజాక్ నిందితుడు) నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. వాస్తవాధీన రేఖ వెంబడి పాక్ సైన్యం వరసగా ఏడోరోజు కూడా కాల్పులు జరిపింది. మూడు జిల్లాల్లోని ఏడు సెక్టార్లలో జరిగిన దాడుల్ని మన సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ నటులు మహీరా ఖాన్, హనియా ఆమిర్, అలీ జాఫర్‌ల ఇన్‌స్టాగ్రాం ఖాతాలను భారత్‌లో స్తంభింపజేశారు.

## కులగణనలో తెలంగాణది రాంగ్ మోడల్

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయానికి సంబంధించిన ఘనత తమదేనని కాంగ్రెస్ చెప్పడాన్ని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పుపట్టారు. ఆయన గురువారం ఇక్కడ తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. "మోదీ పదేళ్లలో కులగణన ఎందుకు చేయలేదు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. 2010లో రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో మాకు తెలియదు. కులగణనకు అనుకూలంగా భాజపా 2010లోనే తన వైఖరి చెప్పింది. నాడు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ తాము ఇందుకు అనుకూలంగానే ఉన్నామని, 2011 జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని అప్పటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. కాంగ్రెస్ మాత్రం ఆ అంశాన్ని పక్కనపెట్టి 2011లో కేవలం జనగణన మాత్రమే చేసింది" అని వివరించారు. మోదీ సర్కారు బీసీలకు అనుకూలంగా తీసుకున్న కులగణన నిర్ణయాన్ని తమ ఘనత అన్నట్లు రాహుల్ గాంధీ చెప్పుకోవడం సిగ్గుచేటు అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "మా ప్రభుత్వం దేశానికి, సమాజానికి జరిగే మేలును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటుంది తప్ప, రాహుల్ గాంధీకో, కాంగ్రెస్ పార్టీకో భయపడి కాదు. కులగణన ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలను బీసీల్లో చేర్చబోం. మత ప్రాతిపదికన ఎవరినీ బీసీల్లో చేర్చే ప్రసక్తే ఉండదు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణనను ఒక తంతుగా చేశారు తప్ప, అందులో శాస్త్రీయత లేదు. అది కులగణన కాదు. కేవలం సర్వే మాత్రమే. తెలంగాణలో కనీసం 50% ఇళ్ల నుంచి కూడా వివరాలు సేకరించలేదు.

## ఇంటిని నిర్మించి ఇస్తాం

నెల్లూరు, ఆత్మకూరు: నారంపేట వేదికపై బంగారు కుటుంబం ప్రాముఖ్యతను సీఎం చంద్రబాబు వివరించారు. అందులో భాగంగా ఎంపికైన ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన జ్ఞానమ్మ కుటుంబం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞానమ్మ మాట్లాడుతూ... యానాది సామాజికవర్గానికి చెందిన తనకు భర్త సుబ్రహ్మణ్యం, నలుగురు పిల్లలున్నారన్నారు. భర్త కూలికి వెళ్లి డబ్బు తెస్తేనే ఇల్లు గడుస్తుందని చెప్పారు. లేదంటే పస్తులుండాల్సిందేనని, అడుక్కొచ్చి పిల్లలకు అన్నం పెట్టాల్సి వస్తోందన్నారు. పిల్లలను చదివించుకోవాలని ఉందని చెప్పారు. ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. చంద్రబాబు స్పందిస్తూ... జ్ఞానమ్మ నలుగురి పిల్లలకూ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేస్తామని, స్థలం మంజూరు చేయడంతో పాటు ఇల్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పిల్లలకు విద్యనందించే బాధ్యతను మర్రిపాడుకు చెందిన సాహో ఫౌండేషన్ నిర్వాహకులు నాగేశ్వరరావుకు అప్పగించారు.

## మరో 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్'

(మొదటిపేజీ తరువాయి)

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ కింద స్లాట్ విధానం అమలు చేస్తామని వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 22 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌పై అధికారులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యాలయాల సేవలపై పోస్టు కార్డు ద్వారా అభిప్రాయాలు తీసుకోగా.. 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చంపాపేట్‌కు చెందిన విష్ణుగౌడ్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి స్పందన తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లకు వినియోగించే ఇంటర్నెట్ వేగాన్ని పెంచాలని అధికారులకు మంత్రి సూచించారు. జూన్ మూడో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో స్లాట్ విధానం అమల్లోకి తేవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగం పెంచేందుకు ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడతామన్నారు. నూతన విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న సిబ్బంది, అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు.

## తెలంగాణలో.. కులగణన తూతూమంత్రమే: కిషన్‌రెడ్డి




దిల్లీ: బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. దిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. "2011 జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూ మంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# కార్మిక వర్గ ప్రతిఘటనతోనే ఎనిమిది గంటల పని దినం చట్టం

* **సిపిఎం సీఐటీయూల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు**
* **మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు**







చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కార్మిక వర్గ ప్రతిఘటనతోనే ఎనిమిది గంటల పని దినం చట్టం అమలు జరిగిందని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. సిపిఎం, సిఐటియు కమిటీల ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20వార్డుల్లో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. 20వార్డులలో జెండాలను ఎగురవేశారు. జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికురాలు మల్లెబోయిన సుగుణమ్మ మృతి చెందడంతో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబానికి చెరుపల్లి సీతారాములు చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు . ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కార్మికుల దీక్ష దినం మే డే అన్నారు. అమరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మే డే ను ఒక పండగల కాకుండా దీక్ష దినంగా జరపాలన్నారు. మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల కార్పొరేట్ మతోన్మాదుల, దోపిడి దాడుల అణిచివేతలు, వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడుతూ వర్గ ఐక్యతను సాధించి వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మే డే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతం కార్మిక వర్గ విజయానికి చిహ్నమన్నారు. బిజెపి ప్రభుత్వం లౌకిక ప్రజాతంత్ర మౌలిక విలువలను మట్టుబెట్ట చూస్తుందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. మతోన్మాద. కార్పొరేట్ బిజెపి విధానాల వల్ల దేశంలో కుల, మత, ప్రాంతీయ, వైశ్యామ్యాలు పెరుగుతున్నాయన్నారు. ఇవి కార్మిక వర్గ ఐక్యతకు విశాల కార్మికు ఉద్యమ ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రత్యామ్నాయ భావజాలంతో కార్మిక వర్గం సంఘటితం కావడం హిందుత్వ శక్తులకు గిట్టడం లేదన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగం ద్వారా పొందిన ప్రాథమిక హక్కులను నిలుపుకోవాలన్నారు. పాలకులు అనుసరిస్తున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం మరింత పట్టుదలతో పోరాడుతూ మేడే అమరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు రాష్ట్ర నాయకులు ఎండి పాషా అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, మాంద్ర శ్రీను, భవన కార్మిక సంఘం అధ్యక్షుడు గునమోని రాములు, ప్రధాన కార్యదర్శి కలకుంట్ల శివ, నాయకులు నెలికంటి నర్సింహ్మా, బండారు నర్సింహ్మా, దండ అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, ఎండి ఖయ్యూం, ఉష్కాగుల శ్రీనివాస్, గోశిక స్వామి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, ఉష్కాగుల రమేష్, ఎండి రేష్మ, తొర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, చికూరి దయ, జాజుల బిక్షపతి, గజ్జల రాజు, గుణముని స్వామి, గంగమ్మ, బావండ్లపల్లి స్వామి, సిహెచ్ పాండు, దాడి సురేందర్ రెడ్డి, బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాలలో కృష్ణవేణి విజయ దుందుభి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ పది పరీక్షల్లో విజయ దుందుభి మోగించింది. పాఠశాల చెందిన దొంతరి శాలిని 600మార్కులకు గాను 559, యం.డి రబియ 556, వర్కాల రోహిత్ 550మార్కులు సాధించారు. 25మంది విద్యార్థులు 500పైగా, 51మంది విద్యార్థులు 400పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గుత్త గోపాల్ రెడ్డి కవితలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉయ్యాల రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పదిలో అద్భుత ఫలితాలు సాధించిన పంచశీల పాఠశాల విద్యార్థులు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మూసాపేట పంచశీల పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆర్. ప్రవీణ్ (560), జి. కవిత(553), టి. సింధు (549), టి. విష్ణు ప్రియ (547), పి. జ్ఞానశ్రీ సాయి అన్షు ల (545) సాధించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 500 మార్కులకు పైన 16 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అందరూ పేద విద్యార్థులే అని పేర్కొన్నారు. హమాలీ, మేస్త్రీ, కార్మికులు, ఇలా పని చేసి జీవించే వారి పిల్లలే అత్యుత్తమ మార్కులు సాధించారని అన్నారు. రానున్న రోజులలో ఇదే స్ఫూర్తితో ముందుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు బిగ్ అలర్ట్..

## సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

తెలంగాణ బ్యూరో: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్‌లో నిర్వహించనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల టైమ్ టేబుల్‌ను ఎస్సెస్సీ బోర్డు గురువారం విడుదల చేసింది. పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుండి 12.30 గంటల వరకు జరుగుతాయని ఎస్సెస్సీ బోర్డు ప్రకటించింది. అన్ని అకాడమిక్ కోర్సు సబ్జెక్టులు, పేపర్లు ఎస్సెస్సీ అకాడమిక్ కోర్సు, ఓఎస్ఎస్ సీ అభ్యర్థులకు ఒకే విధంగా ఉంటాయని బోర్డు స్పష్టం చేసింది. ఒకవేళ ప్రభుత్వం ఏదైనా సాధారణ సెలవు లేదా ప్రభుత్వ సెలవు ప్రకటించినట్లయితే, ఈ టైమ్ టేబుల్‌లో మార్పులు ఉండవచ్చని తెలిపింది.




## కార్మిక చట్టాలను అమలు చేయాలి

- **సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు**
- **పల్లె శేఖర్ రెడ్డి**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: లేబర్ కోడ్లను రద్దుచేసి 44కార్మిక చట్టాలను అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో గురువారం మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ సిపిఐ పార్టీ కార్యాలయం ముందు జెండాను సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ఎగురవేశారు. ఆటో ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో వలిగొండ రోడ్డులో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్ ఎగురవేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జెండాను పాపగల్ల శంకరయ్య ఎగురవేశారు. ఆటో ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో బస్టాండ్ నుండి వలిగొండ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అమెరికా దేశంలోని చికాగో నగరంలో 1886సంవత్సరం మే 1వ తేదీన రోజుకు 8గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులు లక్షలాది మంది నిరసన ప్రదర్శన నిర్వహించగా, పోలీసులు జరిపిన కాల్పుల్లో కొంతమంది చనిపోగా వారి రక్తంతో తడిసిన జెండానే ఎర్రజెండాగా ఎగురవేయడం జరిగిందన్నారు. ఆ మేడే స్ఫూర్తితో కార్మికుల పోరాటం మరింత పదునెక్కించి 8గంటల పని దినాలను సాధించుకుందన్నారన్నారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్ మాట్లాడుతూ హమాలి, ఆటో, ట్రాన్స్ పోర్ట్, కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, లేబర్ కోడ్లను, రద్దుచేసి 44కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు 60సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, బోనస్, పెన్షన్, చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టంగుటూరి రాములు, ఎస్ ఏ రెహమాన్, బద్దుల సుధాకర్, దాసరి అంజయ్య, నీళ్ల బిక్షపతి, రండి నరసింహ, కొండూరు వెంకటేష్, బోయ మంకులు, ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు, ముప్పిడి నరసింహ, బెడద రమేష్, పాప గళ్ళ మల్లేష్, గంగాదేవి రమేష్, బందెల స్వామి, పబ్బురాజు, శ్యామల రవి కుమార్, నల్ల పరమేష్, గుండెబోయిన భాస్కర్, బండి రమేష్, ఎస్ కే సలీం, నరేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## పీఎం స్వ నిధి వీధి వ్యాపారులకు చిన్న రుణాలు అందించే పథకం

* **హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పీఎం స్వ నిధి అనే పథకం వీధి వ్యాపారులకు చిన్న రుణాలు అందించే ఒక పథకం అని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. పీఎం స్వ నిధి పథకం అమలులో భాగంగా గురువారం కూకట్పల్లి జోనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్, ఎఎంఒహెచ్, పీఓ, సీఓ, ట్రాఫిక్ సీఐ, స్ట్రీట్ వెండర్ కమిటీ సభ్యులతో కలసి హైదర్ నగర్ డివిజన్ వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులు తమ వ్యాపారాన్ని పునరుద్ధరించడానికి, విస్తరించడానికి రూ. 10,000 వరకు రుణాలు పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు ఎలాంటి భద్రత లేకుండా రుణాలు లభిస్తాయన్నారు. ఈ రుణాలకు 7% వడ్డీ రేటు వర్తిస్తుందన్నారు. పీఎం స్వ నిధి పథకం యొక్క లక్ష్యాలు వివరిస్తూ., వీధి వ్యాపారులకు చిన్న రుణాలు అందించడం ద్వారా వారి వ్యాపారాన్ని పునరుద్ధరించడానికి, విస్తరించడానికి సహాయం చేయటం, వీధి వ్యాపారులను ఆర్థికంగా బల పరచటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గంగాధర్, ఎఎంఒహెచ్ శ్రీనివాస్, పీఓ రాజశేఖర్, సీఓ ముస్తఫా, చెయిన్ మెన్ మచేంద్ర, కూకట్ పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, స్ట్రీట్ వెండర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పది లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంస్కృతి పాఠశాల విద్యార్థులు




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట రాజీవ్ గృహ కల్ప లోని సంస్కృతి పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 10వ తరగతి ఫలితాలలో 500 మార్కులకు పైగా 5 గురు విద్యార్థులు సాధించారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన హాసిని (548), తనీషా (543), యామిని, యమున లను కరెస్పాండెంట్ గడ్డమీది బాలరాజు శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజులలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి రాజకుమారి, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, అంబిక, నీతూ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచశీల స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పంచశీల స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం మూసా పేట లోని సంతోష్ దాబా హోటల్ లో ఘనంగా నిర్వహించారు. 20082009 బ్యాచ్ విద్యార్థులు అనాటి ఉపాధ్యాయులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆటలు, పాటలతో సరదాగా గడిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి లో ఉన్నవారు పేద విద్యార్థులకు సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సంతోష్, రూప, శాలిని, విజయలక్ష్మి, నూరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మే డే కార్మికుల దినోత్సవ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో కొత్తగూడెం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జెండా ఆవిష్కరించి, మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, సలహాదారులు గుమ్మడి ప్రసాద్, ట్రెజరర్ కుడిపాక కోటేశ్వరరావు, కమిటీ మెంబర్లు మంగీలా కాసిం, రియాజ్, సారయ్య, సల్లూరి భాస్కర్, అల్లం నాగేశ్వరరావు, సుబ్బారావు, కార్మికులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో పన్నెండు గంటల పని విధానం రద్దుకై మరో చికాగో పోరాటానికి సిద్ధం కావాలి

*** సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మే డే స్ఫూర్తితో పన్నెండు గంటల పని విధానం రద్దుకై మరో చికాగో పోరాటానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు పిలుపునిచ్చారు.నూట ముప్పై తొమ్మిదవ మే డే సందర్భంగా కొత్తగూడెంలో కూలిలైన్,పాత కొత్తగూడెం ప్రగతి నగర్ లలో మేడే కార్యక్రమాలలో పాల్గొని జండా ఆవిష్కరణ చేసారు.ఆయన మాట్లాడుతూ పద్దెనిమిది గంటల పని విధానానికి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని విధానం కావాలని నూట ముప్పై తొమ్మిది సంవత్సరాల క్రితం అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికులు చేసిన గొప్ప పోరాటం అన్నారు. ఏడుగురు అమరవీరులు బలిదానం ఫలితంగా నేటి కార్మిక వర్గానికి హక్కులు



చట్టాలు సాధించబడ్డాయని ఆయన తెలియజేశారు. నేడు కార్మికులు సాధించుకున్న హక్కులు నాటి చికాగు అమరవీరుల పోరాట ఫలితమేనని ఆయన పేర్కొన్నారు. ఆ పోరాట ఫలితమే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమల్లోకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పాలక ప్రభుత్వాలు మే డే స్ఫూర్తికి విగాథం కలిగిస్తూ కార్మికులపై పని భారాన్ని మోపుతున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల సంఖ్యను తగ్గించి తక్కువ మంది పై అదనపు భారం మోపుతున్నారని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వట్లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ నాలుగు లేబర్ కోళ్లు తీసుకొచ్చి కార్మిక వర్గంపై తీవ్రమైన పనిభారాన్ని పెంచుతుందని ఆరోపించారు. ఏ కార్మిక వర్గం అయితే తమకు 18 గంటల పని విధానం వద్దని పోరాటం చేశారు అదే కార్మిక వర్గంపై నేడు మోడీ ప్రభుత్వం పన్నెండు గంటల పని విధానాన్ని రుద్దుతోందని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఆ పోరాటంలో భాగమే మే 20వ తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరు లక్ష్మి, టౌన్ కమిటీ సభ్యులు ఆవుల శ్రీరాములు, ఆలేటి శ్రీను, నాగకృష్ణ, లింగయ్య, రామ్ చరణ్, ముత్తేష్, పవన్, షాహెబీ, తదితరులు పాల్గొన్నారు

## కుల సంఘం సభ్యులపై కేసు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తనను కుల సంఘం సభ్యులు నానా బూతులు తిట్టి, కుల బహిష్కరణ చేశారని ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన వల్లపు గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గట్టయ్య భూమి పంచాయతీ విషయంలో కుల సంఘం వారు చెప్పినట్లుగా వినడం లేదని, దీంతో అతన్ని బూతులు తిట్టి కుల బహిష్కరణ చేశారని, ఈ మేరకు కుల సంఘం సభ్యులపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు

## చికాగో అమరుల స్ఫూర్తితో పోరాడాలి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాడి హక్కులను సాధించుకుందామని గ్రామ పంచాయతీ సంఘం ముస్తాబాద్ మండల అధ్యక్షుడు లొకి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మే డే జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గం ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం డప్పు చప్పుల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాలాజీ, పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సంఘం ఉపాధ్యక్షులు పల్లాంటి బాబు, ప్రధాన కార్యదర్శి లచ్చిగారి రమేష్, కార్మికులు బిక్షపతి, జిల్లె లక్ష్మణ్, రాములు, స్వరూప, రగుట్ల రాజు, రవి, గన్నె రాజయ్య, దొమ్మటి పోచయ్య, దేవరాజు బిక్షపతి, సుధాకర్, నరేష్, అశోక్, రాజు, అంజయ్య, నర్సింలు, శ్రీను, వెంకట్, రాజయ్య తదితరులున్నారు.

## జన గణనతో పాటు కులగణన చేయడం స్వాగతిస్తున్నాం

*** ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి: జన గణనతో పాటు కులగణన చేయడం స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. జనగణన తో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటిచడం కాంగ్రెస్ పార్టీ,తెలంగాణ ప్రభుత్వం తరపున స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో కులగణన చేయలేదని అనటం ఆశ్చర్యంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రం కులగణన చేసిన తర్వాత దేశంలో రోల్ మోడల్ అయిందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేస్తున్న సమయంలో వివిధ రాష్ట్రాల్లో వివిధ కులాల వ్యవస్థ చూసి దామాషా ప్రకారం మేమెంతో మాకు అంతా అనే గుర్తించడం కోసం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కులగణన చేయడం జరిగిందన్నారు..కులగణన చేయడమే కాకుండా దానికి చట్ట భద్రత చేసి కేంద్రనికి పంపటం జరిగిదన్నారు.2018 సంవత్సరంలో జనగణన తో పాటు ఓబీసీ కులగణనను చేస్తా అని చెప్పి రాజనాథ్ సింగ్ మాట తప్పరని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు భారత దేశం మొత్తంలో జనగణన తో పాటు కులగణన చేయాలని కోరారు

## అభ్యంతరాలుంటే చట్టపరంగా ఎదుర్కోవాలి

*** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కుల ధ్రువీకరణ పత్రాలు**

*** ముస్తాబాద్ మండల బేడ బుడగ జంగం నాయకులు**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తాము చట్ట బద్ధంగా ధ్రువీకరణ పత్రాలు పొంది రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలకు హాజరైతే కొంత మంది నాయకులు అడ్డుకోవడం సరైంది కాదని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా ఎదుర్కోవాలే గానీ, ఇలా అడ్డుకోవడం ఏంటని ముస్తాబాద్ మండల బేడ బుడగ జంగం నాయకులు దొక్క రాజేష్, కడమంచి రవి ప్రశ్నించారు. ఇటీవల ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి చెందిన కొంత మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, కొంత మంది వ్యక్తులు అడ్డుకున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బేడ బుడగ జంగం సామాజిక వర్గం వారిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి, ఇతర జిల్లాలలో, మండలాలలో ఉన్నవారు వీరి రక్తసంబంధీకులేనని, పూర్తి ఆధారాలతో ఉన్నత అధికారులకు నివేదించారని గుర్తు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ సిబ్బంది అందించిన నివేదిక పరిశీలన అనంతరం బేడ బుడగ జంగం కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత తమకు కుల ధృవీకరణ పత్రాలు అందజేశారని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా బేడ బుడగ జంగాలు ఎంతో వెనుకబడి ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తు చేసుకొని అధికారులు జారీ చేసిన సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కాగా, తమను అడ్డుకోవడం సబబు కాదని అన్నారు. మరోసారి ఇలాంటి పునరావృతం అయితే సహించబోయేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం నాయకులు మోతె పెద్ద వెంకటి, పర్వతం శ్రీనివాస్, సదుల శేఖర్, మోతె రాజు, పూర్ణ చందర్, రమేష్, స్వామి, చింటూ, తదితరులున్నారు.

## దేశ వ్యాప్తంగా కుల గణన చారిత్రాత్మకమైన నిర్ణయం

**- బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి**

**- ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ప్రధాని నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా జన గణనతోపాటు కుల గణన చేయిస్తామని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి అన్నారు. కుల గణనపై ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న కీలక నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో ప్రధాని మోడీ చిత్ర పటానికి గురువారం బిజెపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారని, దేశ వ్యాప్తంగా ఉన్న బిసిలు, ఎస్సీ, ఎస్టీలు అందరూ దీన్ని స్వాగతిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన తప్పుల తడకగా లెక్కలు చేసి మళ్లీ లెక్కిస్తామని ప్రకటన చేసిన దశాబ్దాలుగా వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఈ అంశాన్ని విస్మరించిందని, బిఆర్ఎస్ అధికారం పోయాక విమర్శలు తప్ప చేసేంది ఏం లేదని అన్నారు. ఈ కులగణన సమ్మిళిత వృద్ధి వేగంగా పుంజుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో జన, కులగణనను ప్రారంభించి, రెండేళ్లలో ముగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బిజెవైఎం అధ్యక్షుడు కుడుకల జనార్ధన్, మండల ఉపాధ్యక్షులు చిట్నేని శ్రీనివాస రావు, ఎదునూరి గోపి, గుండవేని తిరుపతి యాదవ్, మండల కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు పొన్నాల సత్యం రెడ్డి, మీస శంకర్, చీకోటి మహేష్, ఓరగంటి సత్యం, కటకం మహేష్, హరీష్, వినయ్, వెంకటేష్, రాజు, రమేష్, ఆకాష్ తదితరులున్నారు

## బిసి కుల గణనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం

**- బిసిటి ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిసి కుల గణనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ అన్నారు. గురువారం ముస్తాబాద్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు గత 50 సంవత్సరాలుగా నిరంతర ఉద్యమాలు, రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేపట్టిన ఉద్యమ ఫలితంగా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయని కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితమంతా పోరాటాలకే అంకితం చేసిన ఆర్.కృష్ణయ్య ఉద్యమ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టుటకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిందని, అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ఇందులో ఆర్.కృష్ణయ్య కృషి ఎంతో ఉందని కొనియాడారు. బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ మిగిలిన బీసీ డిమాండ్లన్నీటిని కేంద్ర ప్రభుత్వం ఒప్పుకునే విధంగా కృషి చేయాలని,



మండల్ కమిషన్ సిఫారసులు పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల సుధాకర్, ధర్పల్లి రాజు, పి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## చాతకొండ 6 వ బెటాలియన్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవి పల్లి మండలం చాతకొండ 6 వ బెటాలియన్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్శన లో భాగంగా కలెక్టర్ నూతనంగా శిక్షణ పొందిన ఎస్ డి ఆర్ ఎఫ్ ( స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ) 100 మంది సభ్యులతో కూడిన బృందంతో ముచ్చటించి ఆపదల సమయంలో వారు చేపట్టే చర్యలను, వారి వద్ద ఉన్న పరికరాలను పరిశీలించి వాటిని ఏ విధంగా ఉపయోగించాలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. బెటాలియన్లు నూతనంగా ఏర్పాటు చేసిన మట్టితో ఇటుకల తయారు (సిఎస్ఈబి) యంత్రములు పరిశీలించి, ప్రయోగాత్మకంగా మట్టి ఇటుకలతో రోడ్డు తయారీ చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బెటాలియన్ అభివృద్ధి పనుల గురించి బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ అబ్దుల్ రషీద్, బెటాలియన్ ఉన్నత అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు.

## మహిళలకు భద్రత సౌకర్యాలు కల్పించాలి

**: జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**





ప్రజాస్ఫూర్తి ఇల్లందు : స్థానిక ఇల్లందు కోర్టు ఆవరణంలో మే డే సందర్భంగా ఇల్లందు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ మే డే అంటేనే ఒక చరిత్రత్మక దినోత్సవం అని, పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు, సమాన పని వేళలు సమాన వేతనం ఉంటాయని, ముఖ్యంగా మహిళలు పనిచేసే చోట వారిపై లైంగిక చర్యలకు పాలు పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని మహిళలకు పని ప్రదేశాలలో యాజమాన్యాలు భద్రతపరంగా బూట్లు, టోపీలు, హ్యాండ్ గ్లౌజులు మెడికల్ కిట్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వరరావు, తపాలా సిబ్బంది, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేద ప్రజల కు వరం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేద ప్రజల కు వరంలాంటిదని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి ప్రాంతానికి చెందిన ఎస్. మంజుల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులకు రూ.1.75 లక్షలు మంజూరు చేయించి గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో బాధితులకు ఎల్ ఓసి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ వైద్యం కోసం ఎదురుచూసేవారు ఎల్ఓసి ని పొంది చికిత్సను పొందాలన్నారు. పేదప్రజల ఆరోగ్యభద్రత ముఖ్యమంత్రి సహాయనిధి అన్నారు.

# ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ 'మేడే'

*** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కార్మిక క్షేత్రాలు, కార్మిక వాడలు, ఉద్యోగ క్షేత్రాలు, బస్తీలు, గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడింది. సిపిఐ, అనుబంధ ప్రజాసంఘాలు, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, విద్యానగర్ బైపాస్ రోడ్డు, గ్రామపంచాయతి కార్యాలయం, ఆటో, హమాలీ, సింగరేణి ప్రధాన కార్యాలయం, రైతుబజార్, భవన నిర్మాణ కార్మికుల అడ్డా తదితర ప్రధాన సెంటర్లలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు మేడే జెండాను ఆవిష్కరించారు, చికాగో అమరవీరులకు నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అని అన్నారు. చికాగో అమరుల స్ఫూర్తితో భారతదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు ఏలికలు దిగిరాక తప్పలేదన్నారు. బ్రిటీష్‌రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భారతంలో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. చట్టసభల్లో ఉన్న మందబలంతో కార్మిక, ఉద్యోగ, ప్రజా, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని, లాభాల్లో నడుస్తున్న సింగరేణి గనులు, రవాణా, టెలికాం, రైల్వే, బ్యాంకులు, ఎలసి, రక్షణ రంగం, ఇస్రో లాంటి తదితర ప్రభుత్వరంగ సంస్థలను కూడా ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు అప్పణంగా కట్టబెట్టిందని విమర్శించారు. ప్రజల కోసం కాకుండా ఆర్థిక బకాసురులకు, ఆర్థిక నేరగాళ్ళగా మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేలా బిజెపి వ్యవహరిస్తోందని, దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని, సామ్రాజ్యవాద శక్తుల చేతిలో మగ్గుతున్న శ్రమకవర్గాన్ని రక్షించేది ఎర్ర జెండానేని అన్నారు. 139వ మేడే స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణ, కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, జి నగేష్, కందుల భాస్కర్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, పొలమూరి శ్రీనివాస్, దీటి లక్ష్మీపతి, బానోత్ గోవిందు, వంగ వెంకట్, అహీమ్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మాచర్ల శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, ధర్మరాజు, యూసుఫ్, నేరెళ్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, లక్ష్మి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, షాహీన్, బత్తుల సత్యనారాయణ, నేరెళ్ల రమేష్, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, జహీర్, విజయలక్ష్మి, సప్పిడి కోటేశ్వరరావు, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన తుప్రాన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

*** 513 మార్కులు సాధించిన చెంచల భవ్యశ్రీ**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం తుప్రాన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి మొత్తం 13మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 12మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పది ఫలితాల్లో పాఠశాల 92.30శాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ నర్సింగరావు తెలిపారు. చెంచల భవ్యశ్రీ 600మార్కులకు 513మార్కులు సాధించి పాఠశాల నుంచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇరిగి అక్షర 470, చెంచల మేఘన 452, కే శ్రీను 446, జె వర్షిత 433, ఈ మాధురి 418, ఎ శివమణి చారి 402, వి బన్ని 396, బి కవిత 371, టి లోకేశ్వరి 336, ఆర్ రామ్ చరణ్ 316, బి శ్రీకర్ 293మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ నర్సింగరావు, వైస్ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, స్కూల్ చైర్మన్ గొండమోని మంజుల, ఉపధ్యాయ బృందం తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెంచల శ్రీనివాస్ లు విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కార్మికులు లేని అభివృద్ధి శూన్యం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కార్మికులు లేని అభివృద్ధి శూన్యమని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. "మేడే" దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లిలోని ఆల్కలీ మెటల్స్ యూనిట్ 2 నందు బిఆర్ఎస్ కార్మిక విభాగం అధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, బిఆర్ఎస్ కార్మిక విభాగం సలహాదారులు, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధికి కార్మికులే పట్టుకొమ్మలన్నారు. అనంతరం కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, బిఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిక్, ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, కార్మికులు వేణు తదితరులు పాల్గొన్నారు.

## మాలోత్ వినోద్ నాయక్ అధ్వర్యంలో వక్ఫ్ బోర్డు కార్యాశాల




బొమ్మలరామారం, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండల కేంద్రం లో మాలోత్ వినోద్ నాయక్ అధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సంబంధించి కార్యాశాల నిర్వహించారు. జిల్లా వక్ఫ్ బోర్డు కో కన్వీనర్ గా ఫకీర్ రాజేందర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.వక్ఫ్ బోర్డు అమెండ్మెంట్ బిల్ 2024.2025 లో ఏముంది వీళ్ళు ఎటువంటి మార్పులు తేబోతున్నారని విషయానికి వస్తే ఇప్పటివరకు గవర్నమెంట్ కి సంబంధించిన ఏవైనా ప్రాపర్టీస్ ని తీసుకుని ఉంటే వాటిని తిరిగి గవర్మెంట్ కి ఇచ్చేయాలి.దగ్గరికి వెళ్లి ఇది మాదే అని ఇకపై నుంచి క్లీన్ చేయరాదు ఒక ప్రాంతంలోని భూమి ఆరు ఇతర ప్రాపర్టీకి చెందిన కాదా అని డిసైడ్ చేసేది కాదు ఈ అన్ని విషయాల్ని ఇకపై నుంచి ఆ ఏరియాకు చెందిన కలెక్టర్ చూసుకుంటాడు ఇది చాలా ఇంపార్టెంట్ చెప్పాను సెంట్రల్ వర్క్ బోర్డ్ కౌన్సిల్లో ఇదిగో ఈ మెంబర్స్ ఉంటారు వీళ్లంతా ముస్లింలే ఉండాలని ఇంతకుముందు రూల్స్ చెప్తున్నాయి కానీ ఇకపై నుంచి అట్లీస్ట్ ఇందులో ఇద్దరు నాన్ ముస్లిమ్స్ ఉండాలి. నెంబర్ ఫోన్ ఇంతకుముందు ఒక బోర్డ్ వచ్చి మీ భూమిని లాకుంటే మన దేశంలోని సివిల్ కోట్లు అందులో ఇన్వాల్వ్ అయ్యేవి కాదు దాం వక్ బోర్డ్ పై మనం డైరెక్ట్ గా హైకోర్టుకి కంప్లైంట్ చేయొచ్చు. ఇకపై ఒక బోర్డ్ ప్రాపర్టీ గొడవల విషయంలో మన దేశ న్యాయవ్యవస్థలు ఇన్వాల్వ్ అవ్వచ్చు చెందిన అన్ని ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ అకౌంట్స్ అండ్ ప్రోసిడింగ్ సంబంధించిన పూర్తి విషయాలు ఇకపై నుంచి సెంట్రల్ గవర్నమెంట్ కి ప్రొవైడ్ చేయాలి అండ్ వీటిని సెంట్రల్ గవర్నమెంట్ అథారిటీ సే దగ్గరుండి మోనిటర్ చేస్తాయి. ఈ ఐదు రూల్స్ లో ఏరులైన మీకు ముస్లింలకు విరుద్ధంగా అనిపించిందా వక్ఫర్డ్ కేవలం ముస్లింల ప్రాపర్టీస్ ని మాత్రమే కాదు ఇతర మతల వారి ప్రాపర్టీని కూడా లాగేసుకుంటుంది కాబట్టి వీళ్ళ కమిటీలో ఇతర మతాలవారు ఉండాల్సింది అలాగే ఇకపై నుంచి వాక్ బోర్డ్ ప్రాపర్టీ కి సంబంధించిన విషయాలన్నీ ఆ ప్రాపర్టీ ద్వారా సంపాదించినరెవెన్యూకిసంబంధించిన విషయాలని సెంట్రల్ గవర్నమెంట్ మోనిటర్ చేస్తుంది అందులో తప్పేముంది కానీ అపోజిషన్ పార్టీలు అని ముస్లిం లీడర్లు మోడీ తీసుకువచ్చిన ఈ అమెండ్మెంట్ బిల్ ముస్లింలకు వ్యతిరేకంగా ఉంది దీంతో ప్రభుత్వం మాభూమి లాగేసుకుంటుంది ఇది రాజ్యాంగ విరుద్ధం అంటూ గొడవలు చేయడం ప్రజల్ని రెచ్చగొట్టడం మొదలుపెట్టారు అడగడం తప్ప ఇక్కడ మోడీ ప్రభుత్వం ఒక మతాన్ని టార్గెట్ చేస్తుండు అని ప్రచారం చేస్తున్నాయి కాంగ్రెస్ ఎంఐఎం తృణమూల్ కాంగ్రెస్ గతంలో కాంగ్రెస్, ఎంఐఎం వాళ్ల కనుగుణంగా 1947 నుంచి 2013 వరకు తీసుకొనొచ్చిన చట్టాలు కేవలం వాళ్ళ పబ్బం కడుక్కోనికనే అంతేగాని పేద ప్రజల ముస్లింలకు న్యాయం జరిగే విధంగా లేదు ఆ చట్టం ఇకనైనా మేలుకోండి ముస్లిం సోదరులారా అని అన్నారు.ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు, మండలం కన్వీనర్ రవీందర్ రెడ్డి,రవి శంకర్, గుండ్ల గోపాల్,సాయి కుమార్,నర్సింహా రెడ్డి,భాస్కర్, బాలరాజు,డాక్టర్ పాండు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మే డే దినోత్సవం...



దమ్మపేట, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినాదంతో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, టి యు సి ఐ ఆధ్వర్యంలో దమ్మపేట మండలం లో మేడే కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద లింగాలపల్లి గ్రామపంచాయతీ వర్కర్స్ ఆధ్వర్యంలో జెండా ను అఖిలభారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ఎగరవేయడం జరిగింది.ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ చికాగో నగరంలో 139 సంవత్సరాల క్రితం కార్మికులు వారి హక్కుల కోసం పని గంటల కోసం పోరాడుతున్న క్రమంలో అప్పుడున్న ప్రభుత్వాలు కార్మికులపై కాల్పులు జరపడం వలన వేలాది మంది కార్మికులు మరణించారు రక్తం ఏరులై పారుతున్న క్రమంలో కార్మికుడు తన చొక్కాను ఎర్రటి రక్తంలో ముంచి ఎగరవేసిన జెండానే నేడు మేడే అని కొనియాడారు కార్మిక అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నో త్యాగాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను రవీంద్ర మోడీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోళ్లను తీసుకురావడం వెనక పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా నరేంద్ర మోడీ పాలన కొనసాగుతుందని, కార్మికులను వారి హక్కుల నుండి వారి పని బాధ్యతలనుండి ఏంటి వేయటమేనని ఇది సంఘటిత అసంఘటిత కార్మికులకు నరేంద్ర మోడీ విధానాలు కార్మికులకు శాపంగా మారాయిని అన్నారు. ఈ మేడే కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం పాలను డివిజన్ అధ్యక్షులు పండూరి వీరబాబు పి వై ఎల్ పాల్వంచ డివిజన్ అధ్యక్షులు కాక వెంకటేష్, కుంజ కాంతారావు, కురసం పోతురాజు, టి యు సి ఐ మండల నాయకులు రోక్కోల అనిల్ కుమార్, పి వై ఎల్ మండల నాయకులు సున్నం జగన్, వూకే మహేష్, పిఓడబ్ల్యూ మండల నాయకురాలు గంగాధర నాగమణి, కుంజా రవి, కుంజా రాజు, కుంజా పాపారావు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో ప్రతీ కార్మికుడి కష్టం, చెమట చుక్కలు ఉన్నాయి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : దేశ నిర్మాణంలో ప్రతీ కార్మికుడి కష్టం, చెమట చుక్కలు ఉన్నాయని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. మేడే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఈస్ట్ కోస్ట్ మాగ్నెట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వసుధ ఫార్మా, ఆంధ్ర పాలిమర్స్ పరిశ్రమలలో నిర్వహించిన వేడుకలకు కార్మిక నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ విప్ కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక విభాగం జెండాను ఎగురవేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ద్వారానే దేశ ప్రగతి సాధ్యమన్నారు.

## జై బాపు జై భీమ్ జై భారత రాజ్యాంగం పాదయాత్ర కు అపూర్వ స్పందన




యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి: ఘనంగా కాల్వపల్లి గ్రామ ప్రజలు గ్రామ శాఖ అధ్యక్షులు ఆహ్వానించారు గ్రామం లో తిరుగుతూ నినాదాలు చేశారు ప్హేల్గాం అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు పాకిస్తాన్ డౌన్ డౌన్ అనీ నినాదాలు చేశారు ప్రధాని నరేంద్ర మోడీ భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బాపూజీ ని పార్లమెంట్ సాక్షిగా అవమానించడం బిజెపి ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇంజ నరేష్ అన్నారు భారత రాజ్యాంగాన్ని మార్చడం ఎవరి తరం కాదని మార్చాలని ప్రయత్నిస్తే దేశ ప్రజలు ఊరుకోరని ఇంజ నరేష్ ఎద్దేవా చేశారు ముందు దేశానికి సైనిక బలగం పెంచాలని ఆర్మీ రిక్రూట్మెంట్ వేగవంతం చేయాలని.ఇంజ నరేష్ అన్నారు ఈ కార్యక్రమంలో రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు నమిలే మహేందర్ గౌడ్,కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడిగే పెంటయ్య,కాల్వపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కాకల్ల శ్రీకాంత్,నెమలి కేదారి గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిలివెర్ బాలరాజు,విట్టల్ నాయక్, కాల్వపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి

**: రాచకొండ సిపి సుధీర్ బాబు**



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో మల్కాజిగిరి జోన్ లోని నేరేడ్ మెట్ సీపీ కార్యాలయంలో మెగా హెల్త్ క్యాంప్ ను విజయవంతంగా నిర్వహించారు. రాచకొండ కమిషనర్, ఆర్కేఎస్సీ చైర్మన్ జి.సుధీర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా వైద్య సేవలను అందుకున్నారు. అనంతరం రాచకొండ సిపి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల దృష్టి సారించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో మామోగ్రఫీ, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్తో పాటు ఎక్స్రే మరియు అల్ట్రాసౌండ్ స్కానింగ్తో సహా వివిధ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందించారు. దీనికి అదనంగా, సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ డిజిటల్ ఉచిత కంటి పరీక్ష అందించగా, సౌజన్య దంత సంరక్షణ ఆసుపత్రులు దంత సంరక్షణకు అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలను అందించాయి. డాక్టర్ కె.కల్పన రఘునాథ్ క్యాన్సర్ ని ముందుగానే గుర్తించడం, దాని నివారణ చికిత్సా, జీవనశైలి మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డీసీపీలు పద్మజ, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషా విశ్వనాథ్, డిసిపి అడ్మిన్ ఇందిరా, డిసిపి సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఉమెన్ ఫోరం జాయింట్ సెక్రటరీ రాధిక నాథ్, ఆర్కేఎస్సీ చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతిలో సత్తా చాటిన శ్రీ సాయి విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు

* విద్యార్థులను అభినందించిన పాఠశాల చైర్మన్ బిర్రు ఆంజనేయులు



M AMULYA 588/600 HANUSH CHAWAN 578/600 V VAISHNAVI 554/600 SADAF FATIMA 548/600 D SAI PREETHI 543/600



MANIKESHWARI 542/600 K LAKSHMAN 535/600 P SWATHI 533/600 M JASHWANTH 531/600

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పదవ తరగతి పరీక్షా ఫలితాలల్లో జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లోని భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఎం. అమూల్య (588/600),తనుష్ చవాన్ (578/600),వి.వైష్ణవి (554),సదాఫ్ ఫాతిమా (548/600)మార్కులు సాధించడం తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ట్రస్మా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి రెండవ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. తమ విద్యార్థులు జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాలకే తలమానికంగా నిలిచి ఫలితాల పరంపరలో అదర హో అనిపించారన్నారు. భవిష్యత్తులో కూడా ఉన్నత చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాల ధిరోహించాలని ఆశీర్వదించారు.పదవ తరగతి విద్యార్థులందరు 100% ఉత్తీర్ణతతో విజయ బావుటా ఎగరవేశారన్నారు.అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ బిర్రు శోభారాణి,అధ్యాపక బృందం పాఠశాల క్యాంపస్ లో విద్యార్థులను శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకుని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

## అటారీవాఘా సరిహద్దు మూసివేత..!

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌లోని పాకిస్థాన్ జాతీయులు స్వదేశానికి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం వివిధ వీసాదారులకు విధించిన గడువు ఏప్రిల్ 30తో ముగిసింది. ఈ క్రమంలోనే వాఘా అటారీ సరిహద్దును తాజాగా పూర్తిగా మూసేసినట్లు సంబంధిత వర్గాల వెల్లడించాయి. అయితే, అంతకుముందు ఈ గడువును ప్రభుత్వం సవరించిందనే వార్తలు వచ్చినప్పటికీ దీనిపై స్పష్టత లేదు. "అటారీవాఘా సరిహద్దు ప్రస్తుతం పూర్తిగా మూసివేశారు. ఇరు దేశాల ప్రజలు రాకపోకలు సాగించే వీలులేదు" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో ఉన్న 125 మంది పాకిస్థానీలు బుధవారం స్వదేశానికి వెళ్లిపోయారు. దీంతో గడిచిన ఏడు రోజుల్లో భారత్‌ను వీడినవారి సంఖ్య 911కు చేరినట్లు సమాచారం. మరోవైపు పాకిస్థాన్‌లో ఉన్న 15 మంది భారతీయులు సరిహద్దు దాటి స్వదేశానికి చేరుకున్నట్లు తెలిసింది.

# హైకోర్టు ఆదేశించినా కొనసాగుతున్న పనులు

* పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించకుండా చేపడుతున్న పనులను నిలిపివేయాలి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నల్ల చెరువు ఎఫ్ టి ఎల్ పరిధి లోని భూమిపై యాజమాన్య హక్కులు కలిగిన పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించకుండా చేపడుతున్న పనులను నిలిపివేయాలని హైడ్రాకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కూకట్ పల్లి గ్రామ సర్వేనెంబరు 27 నుంచి 80 వరకు పట్టా భూములు ఉన్నాయి. 7.38 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతాది పట్టా భూముల్లో నల్ల చెరువు ఎఫ్ టి ఎల్ విస్తరించి ఉంది. చెరువు చుట్టుపక్కల ఉన్న 22 ఎకరాల పట్టాభూమి అనాదిగా పూర్తి యాజమాన్యపు (వ్యవసాయ పట్టా) హక్కులతో రైతులు వ్యవసాయం, అనుబంధ పాడి, కూరగాయాలు సాగు చేసుకుంటూ భూములను జీవనోపాధిగా మార్చుకున్నారు. అర్బనైజేషన్లో భాగంగా కూకట్ పల్లి ప్రాంతం కాంక్రీట్ జింగిలగా మారడంతో వ్యవసాయం కను మరుగైనా పాడి కోసం గెదెలు, ఆవుల షెడ్లు, పాకలు వేసుకుని భూమిని కాపాడుకుంటు వస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల నల్ల చెరువును అభివృద్ధి చేయడానికి హైడ్రా అధికారులు శ్రీకారం చుట్టారు. ఎఫ్ టి ఎల్ పరిధిని శాస్త్రీయబద్ధంగా నిర్ధారించడంతో పాటు భూములకు చట్టబద్ధంగా నష్టపరిహారం అందించాలని పలుమార్లు హైడ్రా అధికారులను కలిసి విన్నవించారు. అయినా పట్టించుకోకుండా పట్టా భూముల్లో గత కొద్ది రోజులుగా హైడ్రా అధికారులు మట్టి తీసే పనులు చేపడుతున్నారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం పట్టా భూములు ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్నా నష్టపరిహారం చెల్లించాల్సిందే నన్న స్పష్టమైన విధానం ఉన్న అందుకు విరుద్ధంగా హైడ్రా వ్యవహరిస్తుండటంతో హైదరాబాదిత పట్టాదారులు రాష్ట్ర అత్యన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అంశంపై పూర్తి విచారణ జరిపిన రాష్ట్ర హై కోర్టు పట్టాదారుల భూముల్లో చేపడుతున్న మట్టి తవ్వకాలను నిలిపివేయాలని, నాట్ టూ ఇంటర్ ఫియర్ అని హైడ్రాను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

### హైకోర్టు ఆదేశించినా కొనసాగుతున్న పనులు

పట్టాభూముల్లో చెరువు పూడిక తీత పేరుతో హైడ్రా చేపడుతున్న తవ్వకా లను నిలిపివేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు అవేమి పట్టించుకోకుండా పోలీసుల పహార మధ్య పనులు చేస్తున్న పట్టా దారులు ఆరోపించారు. హైడ్రా అధికారులకు హై కోర్టు ఉత్తర్వుల కాపీ ని అందజేయం జరిగిందని కాని పట్టించుకోకుండా తమ భూముల్లో పనులు చేపడుతున్నారని వాపోయారు. పనులను నిలిపివేసి తమకు పరిహారం ఏ రూపంలో ఇస్తారో స్పష్టం చేసిన తరువాత అభివృద్ధి పనులు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని వారు స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి పనులను ఇలాగే కొనసాగిస్తే మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని పట్టాదారులు హెచ్చరించారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాడాలి

* సిఐటియు మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వంపై మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ మార్కెట్ ఆటో డ్రైవర్స్ యూనియన్ స్టాండ్ దగ్గర, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం దీపక్ నైట్రేట్ దగ్గర, సెంట్రింగ్ భవన నిర్మాణ కార్మికుల అడ్డాల దగ్గర జగద్గిరిగుట్ట డంపింగ్ యార్డ్ దగ్గర, శ్రీరామ్ నగర్ సెంట్రింగ్ యూనియన్ అడ్డా దగ్గర, షాపూర్ నగర్ రైతు బజార్ హమాలీ యూనియన్ అడ్డా దగ్గర జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ హమాలీ యూనియన్ అడ్డా దగ్గర, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కీలుకాని లక్ష్మణ్, ఈ దేవదానం, మండల నాయకులు పసుల అంజయ్య, కరుణాకర్, రావుల స్వాతి, జి వెంకన్న, వెంకయ్య, మధు, ఖలీల్, తదితరులు పాల్గొని జండావిష్కరణలు చేశారు. అనంతరం షాపూర్ నగర్ సిఐటియు కార్యాలయంలో జరిగిన మేడే బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ అమెరికా లో చికాగో నగరం మార్కెట్లో వేలాదిమంది కార్మికులు రోజుకు 16 గంటల, నుండి 18 గంటల డ్యూటీలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళన నిర్వహిస్తుంటే ఆనాడు ఉన్న బ్రిటిష్ ప్రభుత్వం యజమానులు కలిసి కార్మికుల ఆందోళన పై పోలీసులచే విచక్షణారహితంగా కాల్పులు జరిపి వందలాదిమంది కార్మికుల ప్రాణాలను బలి తీసుకోవడం జరిగిందన్నారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో అప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలలో రోజుకు 18 గంటల పని వేళలు మార్చాలని నిరసనలు చేపట్టిన పోరాట ఫలితంగా 8 గంటల పని కార్మిక చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. నేడు దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను తెచ్చి రోజుకు 12 గంటల పని వేళలు తీసుకువచ్చే విధంగా కార్మిక చట్టాలు హక్కులను సమూలంగా నిర్వీర్యం చేశారన్నారు. కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కును కాల రాస్తున్నాయని కనీస వేతనం అమలు చేయట్లేదన్నారు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటు పరం చేస్తున్నారని కార్పొరేట్ శక్తులకు రాయితీలుస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని అన్నారు. కార్మికులను కుల మత భేదాలతో విభజిస్తూ కార్మికుల ఐక్యతను దెబ్బతిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం పై కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలని మే 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చాయని, అన్ని వర్గాల ప్రజలు సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, శ్రీనివాస్ ముత్యాలు, జహీర్ అనిల్, చందు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతితో మమేకం... ఈ షాండ్లియర్ల ప్రత్యేకం!

ఇంటి అలంకరణలో షాండ్లియర్లది ప్రత్యేక స్థానం. వాటితో వచ్చే రాజసమే వేరు. వెలుగులు పంచుతూ... కొన్నైతే పాటల్ని వినిపిస్తూ... ఇంటికి ఓ గ్రాండ్ లుక్ తీసుకువస్తాయి. అయితే వీటి అందమంతా చీకటి పడ్డాకే. పైగా ఎప్పుడూ చూసే రకాలే. వీటన్నింటిలో మార్పు తేవాలనుకున్నారో ఏమో డిజైనర్లు... ప్రకృతిని జోడిస్తూ ఈ తరాన్ని ఆకట్టుకోవడానికి ప్రయత్నించారు. ఆ ఆలోచనల ఫలితమే 'బోగన్‌విలియా షాండ్లియర్లు'. పేరుకు తగ్గట్టుగానే... బోగన్‌విలియా పువ్వులూ, ఆకుల రూపంలో ఉంటాయివి. పగలు మొక్కల్నే వేలాడదీశామా అన్న భావను కలిగిస్తూ... రాత్రైతే కాంతులీనుతూ ఆకట్టుకుంటున్నాయి. మీకూ నచ్చాయా? తెచ్చేసుకోండి మరి.













# చేతులెత్తేసిన రాజస్థాన్ బ్యాటర్లు..

## డబుల్ హ్యాట్రిక్ కొట్టిన ముంబై



**జైపూర్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఎదురన్నదే లేకుండా పోయింది. బ్యాటుతో బాదేస్తూ.. బంతితో బెంబేలెత్తిస్తున్న ముంబై వరుసగా ఆరో విజయం సాధించింది. బౌల్ట్(3-28), కరన్ శర్మ(3-28)ల విజృంభణతో 100 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తు చేసింది. మొదటగా ఓపెనర్లు రియాన్ రికెల్టన్(61), రోహిత్ శర్మ(53)లు అర్ధ శతకాలతో రెచ్చిపోగా.. సూర్యకుమార్ యాదవ్(48 నాటౌట్), హార్దిక్ పాండ్యా(48 నాటౌట్)లు విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించారు. అనంతరం బౌల్ట్, బుమ్రాల ధాటికి రాజస్థాన్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. 47 పరుగులకే రాజస్థాన్ సగం వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టును కరన్ శర్మ ఆలౌట్ అంచున నిలిపాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ పోరాటంతో స్కోర్ వంద దాటించాడు. అతడిని ఔట్ చేయడంతో ముంబై డగౌట్‌లో సంబురాలు మొదలయ్యాయి.

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 18వ సీజన్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన పాండ్యా సేన ఆరో గెలుపుతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ముంబై.. రాజస్థాన్‌ను 100 పరుగుల తేడాతో ఓడించింది. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓవర్ నుంచే షాక్‌లు తగిలాయి. గుజరాత్ టైటాన్స్‌పై రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ(0) డకౌటయ్యాడు. దీపక్



చాహర్ బౌలింగ్‌లో వైభవ్ టైమింగ్ మిస్ అవ్వగా విల్ జాక్స్ గాల్లోకి లేచిన బంతిని క్యాచ్ అందుకున్నాడు.

బౌల్ట్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది ఆత్మవిశ్వాసంతో కనిపించిన యశస్వీ జైస్వాల్(13).. అదే ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయి బౌల్డ్ అయ్యాడు. దాంతో, 18 పరుగులకే రాజస్థాన్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది. బౌల్ట్ బౌలింగ్‌లో నితీశ్ ఔట్ కాగా.. కాసేపటికే పరాగ్‌ను బుమ్రా బోల్తా కొట్టించాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హెట్‌మైర్(0) తొలి బంతికే సూర్యకు సులువైన క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ శుభం దూబే(15) రెండు సిక్సర్లతో అలరించినా పాండ్యా బౌలింగ్‌లో బౌండరీ లైన్ వద్ద బౌల్ట్ చేతికి చిక్కాడు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్(11)ల్‌ను ఔట్ చేసిన కరన్ శర్మ రాజస్థాన్ ఓటమిని ఖరారు చేశాడు. అయితే.. జోఫ్రా ఆర్చర్(30) కాసేపు పోరాడాడు. దాంతో, రాజస్థాన్ 100 పరుగులు చేయగలిగింది. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత బౌల్ట్ బౌలింగ్‌లో బుమ్రా క్యాచ్ పట్టడంతో ఆర్చర్ ఔటయ్యాడు. ముంబై 100 రన్స్ తేడాతో గెలుపొందింది. ఇప్పటివరకూ ప్రత్యర్థికి 200 ప్లస్ లక్ష్యాన్నినిర్ధేశించిన ప్రతిసారి ముంబై జయకేతనం ఎగురవేసింది.

టాపార్డర్ మెరుపులతో వరుసగా ఐదు విజయాలతో జోరు మీదున్న ముంబై ఇండియన్స్ జైపూర్‌లో కొండంత స్కోర్ కొట్టింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేసిన ఓపెనర్లు రియాన్ రికెల్టన్(61), రోహిత్ శ్మ(53)లు మరోసారి శుభారంభం ఇచ్చారు. ధాటిగా ఆడిన ఇద్దరూ అర్ధ శతకాలతో చెలరేగి భారీ స్కోర్‌కు పునాది వేశారు. సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన వీళ్లు వెనువెంటనే ఔట్ కాగా.. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(48 నాటౌట్), కెప్టెన్ హార్దిక్ పాండ్యా(48 నాటౌట్)లు దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీ దాటించారు.

ఫజల్ హక్‌ను టార్గెట్ చేసిన పాండ్యా 4, 6, 4, 4 తో 21 రన్స్ సాధించాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో సూర్య కొట్టిన బౌండరీతో ముంబై స్కోర్ 200 దాటింది. ఆకాశ్ మధ్వాల్ వేసిన 20వ ఓవర్లో పాండ్యా 4, సూర్య సిక్సర్ బాదగా 13 రన్స్ వచ్చాయి. డెత్ ఓవర్లలో ఊచకోత కోసిన జోడీ 44 బంతుల్లోనే 94 పరుగులు చేసింది. దాంతో, ముంబై నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల కోల్పోయి 217 రన్స్ చేసింది.

## జూన్ 16 నుంచి.. వేగంగా యూపీఐ లావాదేవీలు




**న్యూఢిల్లీ:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు జూన్ 16 నుంచి వేగవంతం కానున్నాయి. కొన్ని సేవల ప్రతిస్పందన సమయం గణనీయంగా తగ్గనున్నది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) దీని కోసం ఒక విధానాన్ని రూపొందించింది. ఏప్రిల్ 26న దీనికి సంబంధించిన ఉత్తర్వును జారీ చేసింది. వివిధ కేటగిరీల యూపీఐ లావాదేవీల కోసం సవరించిన సమయపాలనను అందులో ప్రకటించింది.

కాగా, డెబిట్, క్రెడిట్ చెల్లింపుల సమయం ఇప్పటి వరకు ఉన్న 30 సెకన్లకు బదులుగా 15 సెకన్లు ఉంటుంది. లావాదేవీల స్థితిని తెలుసుకోవడానికి గతంలో ఉన్న 30 సెకన్ల సమయాన్ని 10 సెకన్లకు సవరించారు. అలాగే లావాదేవీల రివర్సల్ కోసం ఉన్న ప్రతిస్పందన సమయం 30 సెకన్లను తాజాగా 10 సెకన్లకు తగ్గించారు. చిరునామా ధృవీకరణ సమయాన్ని 15 సెకన్ల నుంచి 10 సెకన్లకు కుదించారు.

మరోవైపు ఇటీవల యూపీవీ లావాదేవీల్లో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో యూపీఐ వినియోగదారులకు మెరుగైన సేవల కోసం ఈ సవరణలు చేస్తున్నట్లు ఎన్‌పీసీఐ పేర్కొంది. బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు (పీఎస్‌పీ)లు తమ వ్యవస్థలో ఈ మేరకు అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించింది. సవరించిన సమయ ప్రతిస్పందనలకు అనుగుణంగా అన్ని భాగస్వామ్య, వ్యాపార, ఇతర పక్షాలు చర్యలు చేపట్టాలని పేర్కొంది.

## రికార్డు స్థాయిలో ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు..




**న్యూఢిల్లీ:** జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో వసూలయ్యాయి. రూ.2.37లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గత మార్చి నెలలో జీఎస్టీ వసూళ్లు 1.96లక్షల కోట్లు వసూలైన విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.2.10 లక్షల కోట్లుగా ఉన్నది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై ఒకటి నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా ఏప్రిల్-2025 రికార్డులకెక్కింది. ఇక గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. ఏప్రిల్ నెలలో మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయని కేంద్రం విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి.

గతేడాదితో పోలిస్తే మొత్తం 10.7శాతం పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అయితే, రీఫండ్స్ 48.3శాతం ఎక్కువగా ఉండడంతో నికర ఆదాయం 9.1శాతం తగ్గింది. త్రైమాసిక వసూళ్లలో 10.4 శాతం వృద్ధి నమోదవగా.. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నమోదైన 8.3 శాతం వృద్ధి కంటే చాలా ఎక్కువ. ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.1.8 లక్షల కోట్ల మార్క్ దాటడం ఇది వరుసగా నాలుగోసారి.

## తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



**న్యూఢిల్లీ:** ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు ఉపశమనం కలిగించాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.14.50 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అంటే మే 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించాయి.

ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,747.50కి చేరింది. కోల్‌కతాలో రూ.1,851.50కి, ముంబైలో రూ. 1,699కి, చెన్నైలో రూ. 1906కి చేరింది. అయితే, ఇంట్లో వినియోగించే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు.

మరోవైపు విమాన ఇంధన ధరలనూ చమురు కంపెనీలు తగ్గించాయి. దేశ రాజధాని ఢిల్లీలో కిలో లీటరుకు 4.4 శాతం మేర తగ్గించాయి. అంటే రూ.3,954 మేర తగ్గింది. దీంతో కిలోలీటర్ 85,486.80కు దిగొచ్చింది. ఏటీఎఫ్ ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. ఏప్రిల్ 1న కూడా ఏటీఎఫ్ ధరల్ని 6.15 శాతం (రూ.5,870) మేర చమురు కంపెనీలు తగ్గించిన విషయం తెలిసిందే.

## ఒక్కరోజే రూ.2వేలు తగ్గిన బంగారం ధర



**న్యూఢిల్లీ:** గత కొంత కాలంగా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలకు బ్రేక్ పడింది. దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. లక్ష రూపాయలు అధిగమించిన తులం పుత్తడి ధర యూ టర్న్ తీసుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా ధరలు దిగొస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం నాడు బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఒక్క రోజులోనే ఏకంగా తులం బంగారం రూ.2 వేలకుపైనే తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.95,880 పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల పుత్తడి ధర రూ.87,900గా ఉంది. ముంబై, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, భువనేశ్వర్ వంటి ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,730గా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.87,750గా పలుకుతోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇక కిలో వెండి ధర రూ. 99,900 పలుకుతోంది.

## పంజాబ్ కింగ్స్‌కు షాక్..

### మిగతా మ్యాచులకు స్టార్ ఆల్‌రౌండర్ దూరం..



**చెన్నై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ జట్టు రాణిస్తున్నది. చెన్నైతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ విజయం సాధించింది. అయితే, ఆ జట్టుకు షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో మిగతా మ్యాచులకు దూరం కానున్నాడు. వేలు ఫ్యాక్చర్ కావడంతో మిగతా మ్యాచులు ఆడడం కష్టంగా మారింది. మరో ప్లేయర్ మార్కస్ స్టోయినిస్ సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ గాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో ఏడు పరుగులు చేసి ఆస్ట్రేలియా ఆటగాడు అవుట్ అయ్యాడు. చెన్నైతో మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ స్థానంలో సూర్యన్ష్ షెడ్గే అవకాశం దక్కించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. స్టోయినిస్ 'జియోస్టార్'తో మాట్లాడుతూ.. దురదృష్టవశాత్తు మాక్స్‌వెల్ వేలు విరిగిందని.. గాయం అంత తీవ్రంగా ఉంటుందని అతను అనుకోలేదని తెలిపాడు. మ్యాక్స్‌వెల్‌కి స్కాన్ చేసినట్లు తెలిపాడు.

ఇకపై టోర్నీకి అందుబాటులో ఉండడం లేదని తెలుస్తోందని చెప్పుకొచ్చాడు. మ్యాచ్ తర్వాత పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌ను మ్యాక్స్‌వెల్ గాయంపై ప్రశ్నించగా.. అతని స్థానంలో ఎవరికి ఎంపిక చేయవచ్చో ఆలోచిస్తామని చెప్పాడు. జట్టులోని ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నాడు. అజ్మతుల్లా, ఆరోన్ హార్డీ, ఆడని జేవియర్ బార్ట్‌లెట్ ఉన్నారన్నారు. పరిస్థితిని బట్టి జట్టు కూర్పు ఉంటుందని తెలిపాడు. ధర్మశాలలో జరిగే మ్యాచ్‌లో పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపాడు. అంతర్జాతీయ లీగ్‌లు కొనసాగుతున్న నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లను నేరుగా తీసుకోవడం అంత సులభం కాదని.. భారతీయ యువ ఆటగాళ్ల ప్రతిభను పరిశీలిస్తున్నామని.. కొందరు ఆటగాళ్లు ధర్మశాలకు వస్తున్నారని చెప్పాడు. ఇందులో ఒకరికి పంజాబ్ కాంట్రాక్ట్ లభించే అవకాశం ఉందని వివరించాడు.

## క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్

### వైభవ్ సూర్యవంశీని టార్గెట్ చేశారా?

### బాక్సర్ విజేందర్ సింగ్ ట్వీట్ వివాదం

**న్యూఢిల్లీ:** క్రికెట్ ఆటగాళ్లు తక్కువ వయసు చూపి ఆడుతున్నారని మాజీ బాక్సర్ విజేందర్ సింగ్ చేసిన ట్వీట్ వివాదం అవుతున్నది. ఐపీఎల్ స్టార్ పర్ఫార్మ్ వైభవ్ సూర్యవంశీని మాజీ బాక్సర్ టార్గెట్ చేసి ఉంటారని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశంపై సోషల్ మీడియాలో చర్చ






సాగుతోంది. 14 ఏళ్ల వైభవ్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నాడు. అయితే ఈ బీహార్ కుర్రాడు ఐపీఎల్ లో హిస్టరీ క్రియేట్ చేశాడు. 35 బంతుల్లో సెంచరీ కొట్టిన అతిపిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు.

ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బాక్సర్ విజేందర్ తన ట్వీట్‌లో క్రికెటర్లను విమర్శించాడు. ఈ రోజుల్లో వయసు తక్కువ చెప్పి క్రికెట్‌లో కూడా ఆటగాళ్లు ఆడుతున్నారని తన ట్వీట్‌లో పేర్కొన్నాడు. వాస్తవానికి ఆ ట్వీట్‌లో ఎవరి గురించి చెప్పాడో సూటిగా లేదు. కానీ వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారని భావిస్తున్నారు. వయసు ఎక్కువ ఉన్నా.. తక్కువగా చూపిస్తున్నారని తన ట్వీట్ ద్వారా బాక్సర్ విజేందర్ ఆరోపించారు. ట్వీట్ చేసిన టైమింగ్‌పై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఐపీఎల్‌లో వైభవ్ సెంచరీ చేసిన నేపథ్యంలో విజేందర్ అతన్ని టార్గెట్ చేసి ఉంటారని భావిస్తున్నారు. సూర్యవంశీ ఏజ్‌పై డౌట్స్ వ్యక్తం కావడం తో.. కొందరు ఏకంగా సోషల్ మీడియాలో పాత వీడియోలను పోస్టు చేశారు. ఆ వీడియోల్లో అతను వయసు కన్నా ఎక్కువ ఏజ్‌లో ఉన్నట్లు కనిపించాడు.

## వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ టోర్నీ.. ఫైనల్ వేదికను ప్రకటించిన ఐసీసీ!

**లండన్:** వచ్చే ఏడాది జరుగనున్న వుమెన్స్ టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను జులై 5న చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరుగనున్నది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ గురువారం ప్రకటించింది. ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొంటాయి. జూన్ 12 నుంచి మొదలయ్యే వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 33 మ్యాచులు జరుగనున్నాయి. 2017 వుమెన్స్ వన్డే ప్రపంచ కప్ ఫైనల్ సైతం లార్డ్స్‌లో జరిగింది. టీ20 ప్రపంచకప్ మ్యాచులు ఓల్డ్ ట్రాఫోర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్‌లలో జరుగనున్నాయి. టోర్నమెంట్‌లోని జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ రౌండ్ మ్యాచ్‌ల తర్వాత నాకౌట్ మ్యాచులు జరుగుతాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో సహా ఎనిమిది జట్లు అర్హత టీ20 ప్రపంచకప్‌కి అర్హత సాధించాయి. మిగతా నాలుగు జట్లకు క్వాలిఫైయర్ పోటీలు నిర్వహించనున్నారు.

ఐసీసీ అధ్యక్షుడు జై షా మాట్లాడుతూ అన్ని జట్లకు




బ్రిటన్‌లో అభిమానుల నుంచి మద్దతు లభిస్తుందన్నారు. 2017లో లార్డ్స్‌లో జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో స్టేడియం కిక్కిరిసిపోయిందని.. ఫైనల్‌కు ఇంతకంటే మంచి వేదిక లేదన్నారు. టోర్నమెంట్‌కు సిద్ధమవడంపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య జరిగిన 2020 టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌ను చూసేందుకు మెల్‌బోర్న్‌లో రికార్డు స్థాయిలో 86,174 మంది ప్రేక్షకులు వచ్చారు. ఆ తర్వాత కేప్ టౌన్ (2023), దుబాయి (2024) టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచుల సమయంలోనూ స్టేడియాలు ప్రేక్షకులతో నిండిపోయాయి. ఇదిలా ఉండగా.. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఇంగ్లాండ్ మహిళల జట్టు కెప్టెన్‌గా నాట్ సివర్ బ్రంట్‌ను ఎంపిక చేసింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో నాట్ సివర్ ముంబయి ఇండియన్స్ తరఫున బరిలోకి దిగింది. హీథర్ నైట్ స్థానంలో మహిళల ఇంగ్లాండ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైంది. తొమ్మిది సంవత్సరాలు జట్టు కెప్టెన్‌గా కొనసాగింది.

# వేవ్స్ సమ్మిట్‌లో ఒక్కటైన తారలు







**టాకీస్:** నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ - వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు అయ్యారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్,రణ్‌బీర్ కపూర్,దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టుకుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.

## లైమ్‌లైట్‌లోకి శ్రుతి హాసన్..

### పర్సనల్ విషయాలు షేర్ చేసుకున్న ముద్దుగుమ్మ



**టాకీస్:** ఆ మధ్య మీడియాకు దూరంగా ఉన్న శ్రుతి.. ఇప్పుడు చాలా విషయాలను షేర్ చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు. నా చిన్నతనంలో అలా జరిగింది.. ప్రేమలో ఇలా జరిగింది.. అంటూ లైఫ్‌ని ఓ సారి రివ్యూ చేసుకుంటున్నారు. ఇంత సడన్‌గా లైమ్‌లైట్‌లోకి రావాల్సిన అవసరం ఏంటి? సలార్ కంప్లీట్ చేసిన శ్రుతి... మళ్లీ ఎప్పుడు స్క్రీన్ మీద కనిపిస్తారా? అని వెయిట్ చేస్తున్నారు ఆడియన్స్. ఈ ఏడాది కూలీతో పలకరించడానికి రెడీ అవుతున్నారు ఈ భామ. రీసెంట్‌గా తన లైఫ్‌ని ఓ సారి రివ్యూ చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి బెంజిలో తిరిగానని గుర్తుచేసుకున్నారు శ్రుతి. అయితే తన అమ్మానాన్నలు విడిపోయాక ముంబైలో మెట్రో ఎక్కాల్సి వచ్చిందన్నారు. ప్రేమ గురించి కూడా మాట్లాడారు ఈ బ్యూటీ. తన ప్రేమ విఫలమైన ప్రతి సారీ బాధ ఎక్కువగా ఉంటుందన్నారు. ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని కొందరు అడిగే తీరు బాధ కలిగిస్తుందన్నారు. అన్నిసార్లు ప్రేమ విఫలమవుతుంటే మనసు విరిగిపోతుందన్నారు. బ్రేకప్ అయినంత మాత్రాన అవతలి వ్యక్తి గురించి తాను చెడుగా మాట్లాడనని చెప్పారు. కెరీర్ ప్రారంభంలో సినిమాలు బాగా ఆడనప్పుడు అన్ లక్కీ అని ముద్ర వేశారని, గబ్బర్‌సింగ్‌తో హిట్ వచ్చాకే తన కెరీర్ ట్రాక్‌లో పడిందని గుర్తుచేసుకున్నారు శ్రుతి. ప్రస్తుతం కూలీ కోసం వెయిట్ చేస్తున్నట్టు చెప్పారు.

## హిట్-3లో నాని నట విశ్వరూపం

### చీకటి కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం

**టాకీస్:** తెలుగు ప్రేక్షకులకు ఫ్రాంఛైజీ రుచిని 'హిట్' సినిమాలు బలంగా చూపించాయి. నాని కీలక పాత్రలో 'హిట్: ది థర్డ్ కేస్'తో మూడో చిత్రం విడుదలయ్యింది. ప్రచార చిత్రాలు, ఫ్రాంఛైజీపై ఉన్న నమ్మకం ఈ సినిమాపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. దర్శకుడు శైలేష్ కొలను మూడో సినిమాతో ఎలాంటి ప్రభావం చూపించాడు. క్రూరత్వం నింపుకొన్న అర్జున్ సర్కార్ అనే పోలీస్ పాత్రలో నాని నటన ఎలా ఉందన్నదే సినిమా కథ. అర్జున్ సర్కార్ (నాని) ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌లోని హోమిసైడ్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (హిట్)లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో క్రూరమైన ఓ హత్య కేసు వెలుగులోకి వస్తుంది. అది ఎవరు చేశారో పరిశోధిస్తుండగా అచ్చం అదే తరహాలో దేశ వ్యాప్తంగా 13 హత్యలు జరిగిన సంగతి వెలుగులోకి వస్తుంది. దీని వెనుక ఓ పెద్ద నెట్‌వర్క్ ఉందని అర్జున్ తెలుసుకుంటాడు. దాన్ని ఛేదించేందుకు బిహార్, గుజరాత్ తదితర ప్రాంతాలకు వెళ్తాడు. ఆ కేస్ కొలిక్కి వచ్చేలోపు అర్జున్ విశాఖకి బదిలీ అవుతాడు. అక్కడికి వచ్చాక కూడా ఈ కేసేని ఛేదించేందుకు ఏం చేశాడు? వరుసగా జరుగుతున్న ఈ హత్యల వెనుక దాగిన చీకటి కోణాలేమిటి?వాటిని చేయిస్తున్నది ఎవరు? ఆయనకీ మృదుల (శ్రీనిధి)కీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై ఆవిష్కరించారు. ఫ్రాంఛైజీ వచ్చిన తొలి రెండు 'హిట్' సినిమాల్లో పరిశోధనాత్మక కోణమే ఎక్కువ. మూడో కేసుగా రాసుకున్న ఈ కథలో నేర పరిశోధనతో పాటు-, ఓ చీకటి ప్రపంచాన్నీ ఆవిష్కరించాడు దర్శకుడు. భయపెట్టే ఆ ప్రపంచంలోకి హీరో వెళ్లడం, తను



అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడం ఇందులో కీలకం. అయితే, ఆ చీకటి ప్రపంచాన్ని చూపించిన విధానంలోనే సమస్యలున్నాయి. నాని సినిమాలో అలాంటి ప్రపంచాన్ని చూడటం కాస్త ఇబ్బందిగా అనిపిస్తుంది. సమాజంలో హింసాత్మక ఆలోచనల్ని మరింతగా ప్రేరేపించినట్టుగా ఉండే ఈ చీకటి కోణం, రక్తం ఏరులై పారే సన్నివేశాలు సున్నిత మనస్తత్వమున్న ప్రేక్షకులకు మింగుడు పడవు. నిజంగా మన చుట్టూ ఉన్న మనుషులకి ఇలాంటి ఆలోచనలు వస్తే ఏమిటనే భయాన్ని పెంచుతుందీ చిత్రం. పలు హాలీవుడ్ చిత్రాల్ని గుర్తు చేసే ఈ కథ, నేపథ్యం... ఓ మంచి క్రైమ్ థ్రిల్లర్ అనుభూతినైతే పంచుతుంది. కథ, కథనాలు చాలావరకూ ఊహకు తగ్గట్టుగా సాగినా నాని నటన, ఆయన పోషించిన అర్జున్ సర్కార్ పాత్ర సినిమాని నిలబెడతాయి. సీటీకే ప్రపంచం ఒకటి ఉందని సన్నివేశాలు సినిమాకి కీలకం. పద్మవ్యూహంలాంటి ఆ ప్రపంచంలోకి హీరో అడుగు పెట్టడం, అక్కడ చేసే పోరాటం ద్వితీయార్థంలో కీలకం. ఓ గేమ్ తరహాలో సాగే యాక్షన్ ఘట్టాలు సినిమాకి హైలైట్. నాని తనలోని పతాక స్థాయి నటనను ఆవిష్కరించాడు. చాలాసార్లు నాని వన్ మ్యాన్ షో చేశాడు. అర్జున్ సర్కార్ పాత్రలో ఆయన ఒదిగిన తీరు, గాఢతతో కూడిన ఆయన నటన, పోరాట ఘట్టాలు ఈ సినిమాకి హైలైట్. కథానాయిక శ్రీనిధి శెట్టి పాత్రలోనూ బలం ఉంది. ప్రతినాయకుడిగా ప్రతీక్ బబ్బర్ నటన మెప్పించినా, విలనిజం హీరోకి సవాల్ విసిరేలా ఉండదు. సముద్రఖని, కోమలి ప్రసాద్ అలవాటైన పాత్రల్లోనే కనిపిస్తారు. పతాక సన్నివేశాల్లో పలువురు నటుల మెరుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ.

## ఆచితూచి అడుగులేస్తున్న విశ్వక్‌సేన్

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ హీరోలలో మాస్ క దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. లైలా డిజాస్టర్ తో కాస్త డిస్పాయింట్ అయిన విశ్వక్ సేన్ ఇప్పుడు చేయబోయే సినిమాల పట్ల ఆచి తూచి అడుగులు వేస్తున్నాడు. ఈ సారి ఎలాగైనా సూపర్ హిట్ కొట్టాలని కసితో ఉన్నాడు విశ్వక్ సేన్. బూతు, వల్గారిటీ లేకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టు-కుని సినిమాలు చేస్తున్నాడు విశ్వక్. అందులో భాగంగా జాతి రత్నాలు దర్శకుడు కెవి అనుదీప్ తో ఫంకీ అనే చేస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాతో పాటు మరి



కొన్ని కథలు వింటున్న విశ్వక్ సేన్ మరో సినిమాను కూడా లాక్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాకు కల్ట్ అనే -టైటిల్ కూడా రిజిస్టర్ చేసినట్టు సమాచారం. దర్శకుడు తదితర వివరాలు ఏవి తెలియలేదు కానీ ఈ సినిమాను మాజీ మంత్రి శ్రీనివాస యాదవ్ తనయుడు నిర్మిస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబందించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు చక చక జరుగుతున్నాయట. మిగిలిన వివరాలను త్వరలో అధికారకంగా ప్రకటించనున్నారు.

## సినిమాల కోసం ఆస్తులు అమ్ముకున్నాం

### రకుల్ భర్త జాకీ భగ్నాని ఆవేదన

**టాకీస్:** టాలీవుడ్‌లో ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగులో అవకాశాలు తగ్గాక బాలీవుడ్ చెక్కేసింది. అక్కడ అడపాదడపా సినిమాలు చేస్తూ తన స్నేహితుడు జాకీ భగ్నానిని వివాహం చేసుకుంది. పెళ్లయ్యాక కూడా వీరి రాత మారడం లేదు. రకుల్ నటిగా మంచి అవకాశాలు అందిపుచ్చుకోలేకపోతుంది. అలానే రకుల్ ప్రీత్ సింగ్ భర్త అయిన జాకీ నిర్మాతగా రాణించలేకపోతున్నారు. ఆయన బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలలో 'బడే మియా ఛోటే మియా' అనే భారీ బడ్జెట్ చిత్రం నిర్మించారు. గత ఏడాది వేసవిలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. అయితే ఈ మూవీ వైఫల్యంపై తాజాగా జాకీ స్పందించారు. ఈ చిత్రం వలన తాము ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, సినిమా కోసం ఆస్తులు సైతం తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని జాకీ స్పష్టం చేశారు. ఇది నాకు జీవితంలో ముఖ్యమైన గుణపాఠం నేర్పింది. ఒక ప్రాజెక్ట్‌ని భారీ స్థాయిలో నిర్మిస్తే సరిపోదని, మూవీ రిలీజ్ అయ్యాక అర్థమైంది. మా కథతో ప్రేక్షకులు ఎందుకు కనెక్ట్ కాలేకపోయారనే దానిపై ఒక్కసారి విశ్లేషించుకోవాలి. ప్రేక్షకుల నిర్ణయం సరైనదే కావచ్చు, వారిని తప్పు పట్టకుండా దీనిని ఒక పాఠంగా స్వీకరించి భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు- జరగకుండా జాగ్రత్త పడాలి అని జాకీ అన్నారు. ఇక ఈ మూవీ కలెక్షన్స్ గురించి మాట్లాడిన ఆయన మేము పెట్టిన పెట్టు-బడిలో 50 శాతం తక్కువే వసూళ్లు వచ్చాయి. ఈ విషయాలు చెప్పడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు కాని, లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో చిత్రం తీసాం.కాని అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయాం అని జాకీ భగ్నానీ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్-టైనర్‌గా 'బడే మియా ఛోటే మియా' తెరకెక్కగా, ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్, మానుషి చిల్లర్, అలయ ఎఫ్, సోనాక్షి సిన్హా వంటి తారలు కీలక పాత్రలు పోషించారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.